



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# మేడ్చల్ పోలీస్ దేవేందర్ ప్రసాద్‌కు జాతీయ స్థాయి స్వర్ణ పతకం

### శాస్త్రీయ నేర పరిశోధనలో తెలంగాణ పోలీసుల హ్యాట్రిక్ విజయం

**మేడ్చల్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** శాస్త్రీయ నేర పరిశోధనలో తెలంగాణ పోలీసులు మరోసారి సత్తా చాటారు. నాగ్పూర్‌లో నిర్వహించిన 69వ అఖిల భారత పోలీస్ విధి సమ్మేళనంలో తెలంగాణ పోలీస్ జట్టు ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి, వరుసగా మూడోసారి హ్యాట్రిక్ సాధించింది. దేశానికే మార్గదర్శకులుగా నిలుస్తూ వివిధ విభాగాల్లో మన అధికారులు పతకాల పంట పండించారు. మేడ్చల్ డివిజన్ పరిధిలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ ముక్కెర దేవేందర్ ప్రసాద్ పోలీస్ వీడియో చిత్రీకరణ పోటీలో జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తన కృషి మరియు క్రమశిక్షణతో ఈ అరుదైన విజయాన్ని సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు.



బంగారు పతకాన్ని సాధించిన దేవేందర్ ప్రసాద్

**తెలంగాణకు పతకాల పంట**

ఈ పోటీల్లో తెలంగాణ పోలీసులు కేవలం స్వర్ణమే కాకుండా వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. యాంటీ సబోటాజ్ తనిఖీ, కంప్యూటర్ అవగాహనలో ప్రతిభ చాటారు. పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. వీడియో చిత్రీకరణ విభాగంలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గౌరవం తీసుకొచ్చారు. దేవేందర్ ప్రసాద్ సాధించిన ఈ విజయం పట్ల మేడ్చల్ పోలీసులు, గిర్మాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సాగునీటి కాలువలకు ఎసరు

## రాజాపూర్ వెంచర్లలో రియాల్టర్ల బరితెగింపు! అవును నిజమే, చర్యలు తీసుకుంటాం : తహసిల్దార్




జాలితో ఫెన్సింగ్ వేసి కాలువను ఆక్రమించిన దృశ్యం


రహదారి కోసం ఇరిగేషన్ కాలువపై పైపులు వేసి రోడ్డు నిర్మించిన దృశ్యం

**మా దృష్టికి వచ్చాయి : తహసిల్దార్**

బేగంరాజాపూర్ పరిధిలో జరుగుతున్న భూ విక్రయాల వ్యవహారంపై తహసిల్దార్ మాట్లాడుతూ తమ దృష్టికి కూడా ఈ విషయం వచ్చిందని చెప్పారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సిబ్బందితో క్షేత్రస్థాయిలో సంయుక్తంగా విచారణ జరిపిసామని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూములు లేదా సాగునీటి కాలువలు ఆక్రమణకు గురైనట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగిసామని హెచ్చరించారు.

**ధారూర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త** : వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని రాజాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఫామ్ ల్యాండ్‌లుగా మార్చి విక్రయిస్తూ సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ముఖ్యంగా సొంత లాభం కోసం ప్రభుత్వ ఆస్తులను, సాగునీటి కాలువలను సైతం వాడుకుంటున్నా అధికారులు మౌనం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అడిగితే ఆగ్రహం**

గ్రామంలో కొందరు రియల్టర్లు భారీగా ఫామ్ ల్యాండ్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 10 నుంచి 20 గుంటల చొప్పున భూమిని విభజించి, రోడ్లు , బోర్డులు ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ లేదా ఇతర శాఖల నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ అవేవీ లేకుండానే దందా సాగిస్తున్నారు. దీనిపై స్థానిక పంచాయతీ అధికారులు ప్రశ్నిస్తే.. ఫామ్ ల్యాండ్‌కు ఎలాంటి అనుమతులు అవసరం లేదు అని రియల్టర్లు బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తుండటం గమనార్హం.

**లక్నాపూర్ కాలువలకే జాలి ఫెన్సింగ్**

ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులతో రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో లక్నాపూర్ ప్రాజెక్టు నుంచి కాలువలను నిర్మించింది. అయితే, ఈ ఫామ్ ల్యాండ్ లోపలికి వెళ్లేందుకు రియల్టర్లు ఏకంగా ఇరిగేషన్ కాలువపైనే కన్నేశారు. అధికారుల అనుమతి లేకుండానే కాలువలో పెద్ద సిమెంట్ పైపులు వేసి, మట్టి నింపి వెంచర్లోకి దారిని ఏర్పాటు చేసుకున్నారు. మరో అడుగు ముందుకేసి ఒక ఫామ్ హౌస్ యజమాని ఏకంగా ఇరిగేషన్ కాలువకే జాలితో ఫెన్సింగ్ వేసి అక్రమంగా ఆక్రమించుకున్నారు. దీనివల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగడమే కాకుండా, భవిష్యత్తులో కాలువ దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతాంగానికి సాగునీరు అందకుండా పోతుందని స్థానికులు మండిపడుతున్నారు.

# ఎస్‌సి వర్గీకరణలో తెలంగాణ దేశానికి ఆదర్శం

### జగజ్జీవన్ జయంతి వేడుకలలో స్పీకర్ గడ్డం ప్రసాద్

**వికారాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త** : దేశంలోనే తొలిసారిగా ఎస్సీల వర్గీకరణను అమలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవాల సందర్భంగా బిజేఆర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగజ్జీవన్ రామ్ ఆశయాలకు అనుగుణంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పదేళ్ల తర్వాత బడుగు బలహీన వర్గాల పిల్లల కోసం కాస్మెటిక్ చార్జీలను 200 శాతం, డైట్ చార్జీలను 40 శాతం మేర పెంచామన్నారు.

**జిల్లాలో స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి**

జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి విద్య ఒక్కటే మార్గమని, విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలో స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తానని కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. జగజ్జీవన్ రామ్ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాకుండా, ప్రత్యక్షంగా ప్రజల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేశారని ఎస్పీ స్నేహ మెహ్రా కొనియాడారు. పోలీస్ శాఖ పరంగా ప్రజలందరికీ నిస్వార్థంగా సేవలు అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్య, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య మరియు వివిధ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్


మాట్లాడుతున్న ఈటల రాజేందర్

# పార్టీలు మారడం బట్టలు మార్చినంత సులభం కాదు

### బిఆర్‌ఎస్‌లో చేరతాననే వార్తలు నిరాధారం ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** రాజకీయాల్లో పార్టీలు మారడం అంటే బట్టలు మార్చు కున్నంత సులభం కాదని మల్కాజిగిరి ఎంపీ, బీ జేపీ రాష్ట్ర నేత ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఆదివారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూర్ గ్రామ శివారులో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నానంటూ వస్తున్న వార్తలు, వెలుస్తున్న పోస్టర్లు అన్నీ అసత్య ప్రచారాలేనని ఆయన కొట్టిపారేశారు.

**నన్ను బయటకు పంపి కెసిఆర్ పెద్ద తప్పు చేశారు**

తనకు 25 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, తన వ్యక్తిత్వంపై తెలంగాణ ప్రజలకు పూర్తి అవగాహన ఉందని ఈటల పేర్కొన్నారు. తనను అప్పట్లో బీఆర్‌ఎస్ పార్టీ నుండి బయటకు పంపించి కెసిఆర్ పెద్ద తప్పు చేశారని ప్రజల్లో చర్చ జరుగుతోందని అన్నారు. నాడు తనను పార్టీ నుండి బర్తరఫ్ చేయడమే కాకుండా, కోళ్ల ఫారాలు కూల్చివేసి, చట్టబద్ధంగా కొనుక్కున్న ఆస్తులను కూడా అక్రమంగా లాక్కున్నారని ఆరోపించారు. ఇన్ని ఇబ్బందులకు గురిచేసిన ఆ పార్టీలోకి తాను తిరిగి వెళ్తాననే వార్తల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను బుకాయిస్తూ పాలన కొనసాగిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల పునాదుల మీద గెలిచారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకున్నదంతా కక్కిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదని, చివరకు కోర్టులను కూడా మేనేజ్ చేసే స్థాయికి వెళ్లారని ఆరోపించారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వేలం నిలిపివేయాలి

### సిపిఎం నాయకుల బృందం డిమాండ్

**శామీర్పేట, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో ఉన్న దుకాణ సముదాయాల (మడిగెల) వేలం పాటను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సిపిఎం నాయకుల బృందం డిమాండ్ చేసింది. ఆదివారం మధ్యాహ్నం సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం ఆధ్వర్యంలో నాయకుల బృందం తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి, అక్కడ నివాసం ఉంటున్న వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి. సత్యం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఈ మడిగెలను అక్కడి అసోసియేషన్లకు అప్పగించి, వాటి ద్వారా వచ్చే అద్దెతో లిఫ్టులు, మెయింటెనెన్స్ వంటి అవసరాలను తీర్చుకోవాలని సూచించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మడిగెలను వేలం వేసి అమ్మేయాలని చూడటం దారుణమని విమర్శించారు. మడిగెలను అమ్మడం వల్ల వచ్చే డబ్బులు కొద్ది కాలానికే ఖర్చయిపోతాయని, కానీ శాశ్వత మెయింటెనెన్స్ కోసం అద్దె రూపంలో వచ్చే ఆదాయమే లబ్ధిదారులకు మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోవడానికే వేలం పాటలు నిర్వహిస్తోందని, అద్దెలు వసూలు చేయలేకపోవడం ప్రభుత్వ అసమర్థత అని ఆయన ఎద్దేవా చేశారు. జిల్లావ్యాప్తంగా 12 కేంద్రాల్లో ఉన్న 892 మడిగెలను ఈ నెల 15 నుండి వేలం వేస్తామన్న ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. రవి, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, వెంకన్న, లింగస్వామి, మండల కార్యదర్శి కిష్టప్ప, నాయకులు గోపాల్, సంగప్ప, సుధాకర్ నాయుడు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బిసి సంఘం జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా మల్లికార్జున్ యాదవ్



**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** బిసి సంఘం రంగారెడ్డి జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా బాలగేని మల్లికార్జున్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన బిసి సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ యాదవ్, రాష్ట్ర స్టేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ముదిరాజ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సింగీతం సాయి ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ శివకుమార్‌తో పాటు ఇతర బీసీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ బీసీ సమాజ సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని మల్లికార్జున్ యాదవ్ పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన, యువత సాధికారత కోసం కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జీవిత చరిత్రపై ప్రతి కుటుంబంలో చర్చ జరగాలి

### మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** భారత మాజీ ఉపప్రధాని, ప్రముఖ సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకలను ఆదివారం మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరిలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలబస్తీలో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి, సమ సమాజ స్థాపనకు జగ్జీవన్‌రామ్ తన జీవితకాలం శ్రమించారని కొనియాడారు. పార్లమెంట్‌లో, శాసనసభల్లో వివిధ హోదాల్లో పనిచేసి బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గుర్తు చేశారు. ప్రతి కుటుంబంలో పిల్లలకు ఈ మహనీయుల జీవితాల గురించి వివరించి, వారిలో చదువు పట్ల చైతన్యం తీసుకురావాలని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ అందరికీ స్ఫూర్తిదాయకమని, వారి సిద్ధాంతాలను సమాజం తెలుసుకోవాలని పేర్కొన్నారు.

**కులాంతర వివాహాలకు ప్రోత్సాహం**

ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహక ఎఫ్‌డి బాండ్స్‌ను ఎమ్మెల్యే, అధికారులు అందజేశారు. అలాగే దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి దళితరత్న అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల పాటలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బి. నర్సింలు యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ సభ్యులు బి. జైపాల్ రెడ్డి, ఎస్సీ సంఘాల ప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి. పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్, మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్, నాయకులు, అధికారులు

# క్రీస్తు ప్రపంచానికి శాంతి ప్రదాత: ఎమ్మెల్యే యాదయ్య

**మొయినాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** క్రైస్తవుల పవిత్ర పర్వదినమైన గుడ్ ఫ్రైడే సందర్భంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచే క్రైస్తవ సోదరులు చర్చిలకు చేరుకుని ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. మండల పరిధిలోని రెవెన్యూ పరిధిలోని కనక మామిడి క్రీస్తు సిలువ గుట్ట వద్ద నిర్వహించిన కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రపంచానికి శాంతి, ప్రేమ సందేశాన్ని అందించిన యేసు క్రీస్తు త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మనసు కలిగి, ప్రేమ, క్షమ, దయ గుణాలను ఆచరించాలని ఎమ్మెల్యే సూచించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పేందుకు యేసు క్రీస్తు బోధనలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకమామిడి సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి ఉపసర్పంచ్ హరి మాజీ సర్పంచులు ఆకుల పద్మారావు కేఎస్ రత్నం జనార్దన్ రెడ్డి టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్ వార్డ్ మెంబర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, చర్చ్ నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాబోయ్ భాగ్యనగరం

### మార్చి ప్రారంభం నుంచే వేసవి సెగ
### సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు
### ఏప్రిల్‌లో ఠారెత్తిస్తున్న సూరీడు
### ఎండ తీవ్రత తాళలేక మెట్రో బాట పడుతున్న ప్రయాణీకులు

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాతవార్త):** రాజధానిలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో నగరవాసులు బెంబేలెత్తుతున్నారు. మార్చినెల ప్రారంభం నుండే ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతుండటం తో బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఏప్రిల్ మాసం మొదటి రోజు నుండే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రయాణికులు చల్లని ఏసీ ప్రయాణాన్ని ఇచ్చే మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్నారు.

ఎండల దెబ్బకు సాధారణం గా రోజుకు 4.60 లక్షల నుండి 4.80 లక్షల వరకు ఉండే మెట్రో ప్రయాణికుల సంఖ్య, ప్రస్తుతం 5 లక్షలపై చిలుకు మార్కును దాటింది. రానున్న రోజుల్లో ఎండలు ఇంకా ముదిరితే ఈ సంఖ్య 6 లక్షలకు చేరుకోవచ్చని మెట్రో అధికారులు అంచనా వేస్తున్నారు.

**కారిడార్లలో విపరీతమైన రద్దీ** : ఎల్బీనగర్ మియాపూర్, నాగోల్ రాయదుర్గం వంటి ప్రధాన కారిడార్లలో రద్దీ అత్యధికంగా ఉంటోంది. ముఖ్యంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉన్న ఉక్క పోతను తట్టుకోలేక చాలామంది ప్రయాణికులు మెట్రో వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల పీక్ అవర్స్‌లో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి.



**ప్రయాణికుల డిమాండ్:** అమీర్‌పేట్ వంటి ఇంటర్‌ఛేంజ్ స్టేషన్లలో రద్దీని దృష్టిలో ఉంచుకుని, పీక్ అవర్స్‌లో ప్రతి 3 నిమిషాలకు ఒక రైలు నడపాలని ప్రయాణి కులు మెట్రో యాజమాన్యాన్ని కోరుతున్నారు. ప్రయాణం సుఖవంతంగా ఉన్నప్పటికీ, రద్దీని తగ్గించేలా సర్వీసులను పెంచాలని వారు అభిప్రాయపడుతున్నారు.


బాలంరాయి చౌరస్తాలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

### జగ్జీవన్‌రామ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల ఆశా జ్యోతి, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. జగ్జీవన్‌రామ్ 119 జయంతిని పురస్కరించుకొని ఆదివారం బాలంరాయి చౌరస్తా, పికెట్, బొల్లారం ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావ్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు గౌడ్, మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

**కంటోన్మెంట్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** భారత మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక కిషన్‌మాదిగ రసూల్‌పురాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవుడు తదితరులు పాల్గొన్నారు.

### పాతబస్తీలో జగ్జీవన్‌రామ్ జయంతి


అలియాబాద్‌లో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ 119 వ జయంతిని పురస్కరించుకొని ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ రోడ్డు బుడగజంగం కాలనీలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బుడగజంగం కాలనీ అధ్యక్షుడు కప్పరి రవి, మీసాల జైహింద్, కప్పరి మధు, కడమంచి బాబు, వెంకటేష్, రాకేష్, సిరిసాల వంశీ, ఉపాధ్యాయులు శ్రీవాటి శ్రీనాథ్ పాల్గొన్నారు.

**అలియాబాద్‌లో...**

అలియాబాద్ జలమండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహ్మద్ సలీమ్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి బాబూజీ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు జి.సర్వేశ్వర్‌రావు, మహ్మద్ యూసుఫ్, యాదయ్య, గణేష్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఛత్రినాక చౌరస్తాలో...**

ఎంఆర్‌పీఎస్ ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఛత్రినాక చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు దార్ల యాదగిరి మాదిగ బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు ముక్కెర రమేష్ మాదిగ, బండి నరేష్ మాదిగ, ఎంఈఎఫ్ నేతల ముత్యాలు, పి.మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**చాంద్రాయణగుట్టలో...**

చాంద్రాయణగుట్ట హరిజనబస్తీలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌సిఆర్ పిఎస్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రాయల నర్సింగ్‌రావు బాబుజీ విగ్ర హానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.విఠల్, కె.బాబురావు, కె.నాగరాజ్, భజరంగ్ తదితరులు పాల్గొన్నారు.

### పరిపాలన దురంధరుడు బాబూ జగ్జీవన్‌రామ్
#### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న

**గోషామహల్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దళిత వర్గాల ఆశాజ్యోతి పరిపాలన దురంధరుడు దళిత హక్కుల కోసం పరిరక్షించిన గొప్ప రాజనీతి కోవిదుడని మాదిగ రిజ్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బషీర్‌బాగ్ చౌరస్తా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్ని జగ్జీవన్‌రామ్ వి గ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడిన గొప్పవ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎంపిఆర్ఎస్ ప్రతినిధులు పూజల రవిమాదిగ, శ్రీనివాస్‌మాదిగ, శివమాదిగ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**పురానాపూల్‌లో...**

**బేగంబజార్, ఏప్రిల్ 5ప్రభాతవార్త:** డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్స వాలను పురస్కరించుకుని మాదిగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పురానాపూల్ స్వామివివేకనందనగర్ అమ్మవారి ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ వి గ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో బస్తీకమిటి ప్రతినిధులు ఎం.పి భీష్మా, పిశ్యామ్‌కుమార్, ఎం.ప్రభాకర్, గురుచరణ్, పి.మహేందర్, బద్రీ, ప్రేమ్ కుమార్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

### ఎఐఎస్‌సిఆర్‌పి సొసైటీ జాతీయ కార్యదర్శిగా సర్వేశ్వర్‌రావు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ (ఎఐఎస్‌సిఆర్‌పిఎస్) జాతీయ కార్యదర్శిగా అలియాబాద్ జలమండలి ఉద్యోగి జి.సర్వేశ్వర్‌రావు నియమితులైయ్యారు. లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎఐఎస్‌సి ఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు ఎస్.రాజు వస్తాద్ నుండి నియామకపత్రాన్ని స్వీకరించారు. సొసైటీ నిబంధనలు, ఆదేశాల మేరకు పనిచేస్తూ సంస్థ ఉన్నతికి కృషి చేయగలరని రాజు వస్తాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ కార్యదర్శిగా నియమితులైన సర్వేశ్వర్‌రావు మాట్లా డుతూ ఆల్ ఇండియా ఎస్‌సిఆర్‌పి సొసైటీ తనపై విశ్వాసం, నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానన్నారు. అలియా బాద్ జలమండలి కార్యాలయ ఉద్యోగులు సర్వేశ్వర్‌రావును పూలమాల, శాలువతో సన్మానించి మిఠాయిలు తినిపించారు.



నియమాక పత్రం అందుకుంటున్న సర్వేశ్వర్‌రావు


పాటిగడ్డలో జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



గాజులరామారం 125వ డివిజన్‌లో...


సంజీవరెడ్డి నగర్‌లో...


బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం ఎక్స్ రోడ్స్ లో..


నాచారంలో...


హెచ్‌ఎంటీనగర్‌లో...


ఫిల్మ్‌నగర్‌లో...


బీజేపీ మహిళా మోర్చ నేత వీరపనేని పద్మ...


బోయిన్‌పల్లిలో...


అడ్డగుట్టలో...


బిఆర్ఎస్ ఆధ్వర్యంలో....


హైదర్షాకోట్ డివిజన్‌లో...

# బాబూ జగజ్జీవనరామ్‌కు ఘన నివాళులు

**బేగంపేట ఏప్రిల్ 5,ప్రభాతవార్త :** రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని రాణిగంజ్‌చౌరస్తాలో బాబూ జగజ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా మాజీ కార్పొరేటర్ చీరె సుచిత్రాశ్రీకాంత్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డివిజన్ అధ్యక్షులు దుర్గాప్రసాద్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ జయంతి వేడుకలలో ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీరె శ్రీకాంత్, బీజేపీ జిల్లా మాజీ సహ కోశాధికారి ఎస్ఆర్ మల్లేష్, డిఆర్ శ్రావణ్‌కుమార్, రాంగోపాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షులు సందీప్ వర్మ, ఆకుల ప్రతాప్, దయానంద్, సూర్యవంశీ, ప్రవీణ్, ఆనంద్ వ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

**పాటిగడ్డలో...**

**బేగంపేట, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** బేగంపేట పాటి గడ్డలో బాబూ జగజ్జీవనరామ్ 119వ జయంతి వేడుకల లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సుధాం తదితరులు.

**ఖైరతాబాద్ డివిజన్‌లో...**

**ఖైరతాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాతవార్త):** డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ సర్కిల్(బడాగణేష్) వద్ద ప్రత్యేక కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి విజయరెడ్డి పాల్గొని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నిర్వాహకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

**ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో...**

**ఖైరతాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాతవార్త):** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో బాబూ జగజీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. స్థానికంగా వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కలిసి వైభవం గా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగజీవన్‌రామ్ విగ్రహాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నాయకులు ప్రసంగాలు నిర్వహించారు. అదేవిధంగా పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గాజులరామారంలో...

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** గాజుల రామారం 125వ డివిజన్‌లో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్యాక్స్ డైరెక్టర్ పరుష శ్రీని వాస్‌యాదవ్, కస్తూరి బాలరాజు, డీఎల్ లక్ష్మణ్, శివయ్య, ప్రసాద్, దేవుని సత్తయ్య, కిష్టయ్య, నీరుడి పెంటయ్య, రంజన్, సమ్మయ్య, గౌస్ బాయ్ తదితరులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బాబూ జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

**సంజీవరెడ్డినగర్‌లో...**

**సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్య క్షుడు ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో బల్కంపేట్ శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం ఎదురుగాఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పూలమాలలు వేసి మహనేతకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వనం శ్రీనివాస్, కట్ట బలరాం, మోత్కు పల్లి రమేష్, ముత్యాల లక్ష్మణ్, ముత్యాల కృష్ణ, చెలి మెల శివశంకర్, బీజేఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్య క్షులు కొమ్ము రవి, మోత్కుపల్లి పాండు, మిర్యాల రాజు, బోల్లి పాక నగేష్, రామేశ్వరం వెంకటేష్, మోత్కుపల్లి ప్రేమ్ కుమార్, రామేశ్వరం రాజశేఖర్, రాము, స్థానిక బస్తీవాసులు, దళిత సంఘాల నాయకులు, బల్కంపేట్ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సుందరయ్య పార్కులో...**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ప్రభాతవార్త) :** బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివా రం మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను ఈ సంద ర్భంగా క్లబ్ సభ్యులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమం లో క్లబ్ కార్యదర్శి ఎం.దశరథ్, రవికుమార్, ఉపాధ్య క్షులు కళ్యాణ్‌నాయక్, గత అంతర్జాతీయ అధ్యక్షులు నాగ భూషణం, ఏవీపీ మురళీ కృష్ణ, గత ఏవీపీ సంపత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గత అధ్యక్షులు ఎస్. రమేష్ రెడ్డి, రఘు రామ్, వర్మ, అంజి యాదవ్ మరియు పెద్ద సంఖ్యలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

**బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం ఎక్స్ రోడ్స్‌లో..**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 5 (ప్రభాతవార్త) :** దేశానికి బాబు జగజ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి కొనియా డారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం ఎక్స్ రోడ్స్ వద్ద బాబు జగజ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు పూస రాజు, మద్దూరి శివాజీ, గోపి, రాములు, వివేక్, హర్ష, మాధవ్ రెడ్డి, నరసింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

**గాంధీనగర్‌లో...**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 5(ప్రభాతవార్త) :** స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం గాంధీనగర్ ఆంధ్ర కేఫ్ వద్ద లక్ష్మీ  గణపతి దేవాలయ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలం గాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. దేశానికి జగజ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ ప్రెసిడెంట్ అభిషేక్ కెన్నెడీ, శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, సాయి రాం, నర్సింగ్, సబర్మతి రాజు, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, కృష్ణ యాదవ్, నరేందర్ యాదవ్, నవీన్, బాబూరావు, రాజేష్, చందు, అప్పు తదితరులు పాల్గొన్నారు.


రాణిగంజ్ చౌరస్తాలో జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**దేవులపల్లి రవి కిరణ్ ఆధ్వర్యంలో...**

**సంజీవరెడ్డినగర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** అమీర్‌పేట లోని సోనబాయమ్మ ఆలయం సమీపంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నేత దేవులపల్లి రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, బ్రహ్మయ్య, రజినీకాంత్, జి.సత్యనారాయణ, కృష్ణకుమార్, ప్రతాప్‌నాయక్, సాయి గౌడ్, రాజేశ్వర్, బాబురావు, విజయ్, చంద్ర పాల్గొన్నారు.

**నాచారంలో...**

**తార్నాక, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :** కార్మికుల హక్కుల కోసం, రైతుల సంక్షేమానికి, దేశ ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు బిజెపి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా నాచారంలో ఆది వారం జగ్జీవన్‌రామ్ సమాజానికిచేసిన సేవలను స్మరించు కుంటూ నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గౌడెల్లి రామకృష్ణ, ఎరుపుల నర్సింగ్‌రావు, ఎరుపుల చిన్న, రమేష్, నాగరాజు, రాజు, ఎమ్ డి.ఘౌస్, లలిత్, రాకేష్, రాజు, ఫిరోజ్, హరిబాబు, జగదీష్, బాల్‌రాజ్, ప్రేమ్, అనిల్, గణేష్ పాల్గొన్నారు.

**హెచ్‌ఎంటీనగర్‌లో...**

**నాచారం, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** నాచారం హెచ్‌ఎమ్‌టి నగర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బిఎల్ఆర్ పాల్గొన్నారు. నాచారం హెచ్‌ఎమ్‌టి నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్‌లో డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

### దళితుల హక్కుల పరిరక్షణకు కృషి
#### - ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పత్తిరాజు

**నార్సింగి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :**

దళితుల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పని చేస్తానని ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పత్తిరాజు పేర్కొన్నారు. ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ జాతీయ అధ్యక్షులు సిరుగుమల్లే రాజు ఉస్తాద్ చేతుల మీదుగా పత్తిరాజు రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియామక పత్రంను అందు కున్నారు. అనంతరం పత్తి రాజు మాట్లాడుతూ దళిత జాతిలో పుట్టినందుకు గర్వపడుతున్నానని తెలిపారు. సంఘ సంస్కరణలో దళిత జాతి చేసిన సేవలు అనితర సాధ్యమన్నారు. మహర్షులు, మేధావులు గొప్ప గొప్ప వారిని దేశానికి అందించిన జాతి దళితజాతి అని తెలిపారు. వ్యాసుడు, వశిష్టుడు, విదురుడు, వాల్మీకి, శ్రీసుఖుండు, గుహుడు, శబరి, అంబేద్కర్, జగ్జీవన్‌రాం వంటి ఎందరో మహనీయులు దేవుడి కార్యాలను ఫలవంతం చేసేందుకు దళితజాతిలోనే జన్మించారని వివరించారు. రాజులు, రారాజులు, చక్రవర్తులకు సైతం అస్త్ర, శస్త్ర, శాస్త్రాలను నేర్పించిన మహనీయులు దళితులేనని తెలిపారు. దళితుల సంక్షేమం కోసం ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ ఏ ఆదేశమిచ్చినా, ఏ పిలుపు ఇచ్చినా విజయవంతం చేసి తీరుతా మన్నారు. కంఠంలో ప్రాణం నిలిచి ఉన్నంత వరకు నా దళిత జాతి ఐక్యతకు, అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తానని పత్తిరాజు స్పష్టం చేశారు.

### కౌటికే విఠల్‌కు సత్కారం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 5(ప్రభాతవార్త) :** జీవిత బీమా రంగంలో అచంచలమైన విశ్వాసం, అంకితభావంతో ముందుకు సాగుతున్నట్లు చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ కౌటికె విఠల్ పేర్కొన్నారు. ఆదివారం భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని సీబీ8 టీమ్ ప్రతినిధి కౌటికే విఠల్ అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఘనంగా సత్కరించారు. ఎల్ఐసీ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ విభాగంలో ఆయన దేశంలోనే నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ నిరంతర కృషి, అంకితభావంతో విఠల్ సాధించిన ఈ మైలురాయి తోటి ప్రతినిధులకు స్ఫూర్తిదాయకమని సీనియర్ డివిజనల్ మేనేజర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు సంస్థ తరపున ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. ఈ చిరస్మరణీయ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన తన పాలసీ దారులు, శ్రేయోభిలాషులు సహచర ఏజెంట్లకు హృదయపూర్వక కృత జ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన విజయ ప్రస్థానంలో క్రమశిక్షణ, దృఢ సంకల్పం, గౌరవం, సమర్పణ అనే నాలుగు సూత్రాలే మూలాధారమని వెల్లడించారు. ఈ విలువలే తనను నేడు ఈ ఉన్నత స్థాయికి చేర్చాయని ఆయన వివరించారు. ఈ విజయం కేవలం నా ఒక్కడిది కాదు. నాపై నమ్మకం ఉంచిన ప్రతి పాలసీదారుడిది, నాకు వెన్నుముకగా నిలిచిన మిత్రులు శ్రేయోభిలాషులది అని అన్నారు.


మణిప్రసాద్ భరతనాట్య ప్రదర్శనలో దృశ్యం

### ఆకట్టుకున్న మణిప్రసాద్ భరతనాట్యం

**రవీంద్రభారతి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :** ప్రముఖ నాట్య శిక్షణా సంస్థ మయూరి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరం లో ప్రఖ్యాత భరతనాట్య గురువు వైదేహి సుభాష్ శిష్యుడు మణిప్రసాద్ భరతనాట్య ఆరంగేట్రం నవరసోస్పాదంగా కన్నులపండువ కావించింది. మణిప్రసాద్ పలు భరతనాట్య అంశాలను శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శిస్తూ అలవోకగా నర్తించి ఆహుతుల హర్షధ్వానాలతో ప్రశంసలందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, విశిష్ట అతిథులు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ నాట్యగురువు కళాశ్రీ డా. పి.రమాదేవి, మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, గాంధీభవన్ పిఆర్ఓ హరిప్రసాద్, మణిప్రసాద్ తల్లిదండులు ప్రసాద్, చంద్రిక తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి మణిప్రసాద్ భరతనాట్య ఆరంగేట్రంను లాంఛనంగా ప్రారంభించి ప్రసాద్ తొలిప్రదర్శనలోనే తన నటనాచాతుర్యాన్ని చాటుకుంటూ తన్మయుల్ని చేయడం హర్షదాయకమని కళాకారుడుని, గురువు సుభాష్‌ను ఎంతగానో అభినందించి ఘనంగా సత్కరించారు.

### పికెట్ చౌరస్తాలో జగ్జీవన్ రామ్ జయంతి

**కంటోన్మెంట్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ పికెట్ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జగ్జీవన్ రామ్‌కు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద, సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్. జాతీయ కన్వీనర్ శ్యామ్ ప్రసాద్, బిజెపి నాయకులు డాక్టర్ వంపా తిలక్, జె.భాస్కర్, రాజ్‌మల్లేశ్, అశోక్, సత్య నారాయణ, రొట్టెల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అక్రమాలపై జ్యూడిషియల్ విచారణ జరపాలి

### బిఆర్ఎస్ నేతల డిమాండ్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** బడంగ్ పేట్‌లో జరిగిన బడా అవినీతి వ్యవహారంపై జ్యూడి షియల్ విచారణ చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బడంగ్‌పేట్‌లోని పిఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లో అవినీతి అక్రమాలకు బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేకమనీ అయితే జరిగిన నిధుల దుర్వినియో గంపై ఏ విచారణ చేసినా స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్ల పదవిలో ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్‌లు బడంగ్‌పేట్‌లో జరిగిన అవినీతి, అధి కారుల సస్పెన్షన్‌పై ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. పాలకవర్గ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బడంగ్‌పేట్‌కు సంబంధించి వివరణ ఇస్తారేమోనని తాము భావిం చామని వారు తెలిపారు. ఇక్కడి జరిగిన అవినీతిలో ఎవరి ప్రమేయం ఉందనేది తేలాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు జ్యూడిషియల్ విచారణ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, యాతం పవన్‌యాదవ్, సుక్క బాలరాజ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనాచారి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, గట్టు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు

## వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

**పూడూరు, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కద్మూరు గ్రామ శివారులో ఉన్న శ్రీ మల్లికార్జునస్వామి కళ్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఉదయం పలు రకాల పిండివంటలు తయారుచేసి శ్రీస్వామివారికి నైవేధ్యం సమర్పించేందుకు ఒగ్గు కళాకారులు (బీర్లవారు)డోలు వాయిధ్యాల మధ్య వీధివీధిలో కలియ తిరుగుతూ బోనాలతో గ్రామం నుండి దేవాలయం వరకు భారులు తీరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలు భక్తులను ఆలరింపజేశాయి. మధ్యాహ్నం ఒగ్గు కళాకారులు (బీర్లవారు) కొమరవెల్లి మల్లన్న జీవత చరిత్రను కళారూపాలు (ఒగ్గుకథల) ద్వారా తెలియజేస్తూ, భాజా భజంత్రీలు, డోలు వాయిధ్యాల మధ్య శ్రీ మల్లికార్జున స్వామివారి (కొమరవెల్లి మల్లన్న-బ్రమరాంభల)కళ్యాణం చూడముచ్చటగా నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు ప్రక్కల గ్రామాలవారు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామం అంతా శ్రీ మల్లికార్జున స్వామివారి నామ స్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు జొన్నాడ శంకరయ్య దంపతులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


నిల్వ ఉన్న రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు

## అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం పట్టివేత

**కుల్కచర్ల, ఏప్రిల్, 5, ప్రభాతవార్త :** అక్రమంగా నిలువ ఉంచిన ఉచిత రేషన్ బియ్యాని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుల్కచర్ల మండల మండల కేంద్రానికి చెందిన ముగుద రవితేజ ఇంట్లో 31 బస్తాలు, ప్రదీప్ ఇంట్లో 38 బస్తాల ఉచిత రేషన్ బియ్యం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి ఇండ్లలో తనిఖీలు చేయగా సూమారు. 20 క్వింటలు పట్టుబడటంతో అ బియ్యాని సిజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ...పోలీసులు అక్రమంగా రేషన్ బియం నిల్వ ఉంచిన, తరలించిన చర్యలు తప్పవని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ ఖాజఖాన్, జైపాల్ రెడ్డి ఉన్నారు.



## నాగారం టు వికారాబాద్ బస్సు పునఃప్రారంభం

**ధారూర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగారం గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. గత కొన్నేళ్లుగా నాగారం నుండి తరిగోపుల, జైదుపల్లి మీదిగా వికారాబాద్‌కు వెళ్లే బస్సు సర్వీసులు సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు తెరపడింది. గతంలో ఈ మార్గంలో బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ, కొంతకాలంగా కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు నడుస్తుండటంతో విద్యార్థులు, రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ నిరటి లక్ష్మి ్మ ఇటీవల శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. రవాణా సౌకర్యం లేక పేద ప్రజలు, విద్యార్థులు పడుతున్న అవస్థలను వివరించి, వెంటనే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. సర్పంచ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన స్పీకర్, వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. స్పీకర్ ఆదేశాలతో ఆదివారం నుండి ఈ మార్గంలో బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు పునఃప్రారంభించారు. తమ సమస్యపై తక్షణమే స్పందించి బస్సు వేయించినందుకు సర్పంచ్ నిరటి లక్ష్మి ్మతో పాటు స్థానిక ప్రజలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బస్సు అందుబాటులోకి రావడంతో రవాణా కష్టాలు తీరాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


నూతన బోరు మోటర్‌ను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్, స్థానికులు

## తాగు నీటి సమస్య తలెత్త కుండా చర్యలు

**కుల్కచర్ల, ఏప్రిల్, 5ప్రభాతవార్త :** గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్త కుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు. అదివారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో బిసి కాలనిలో నీటి సమస్య ఉందని గుర్తించి వెంటనే నూతన బోరు మోటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ.. వెసవి కాలం దృష్టిల ఉంచుకోని గ్రామంలో నీటిసమస్య ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరిస్తునట్లు తెలిపారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నమని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృధా చేయాకుండా పొదుపు వాడుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జి, రమేస్, నర్సింలు, మొగులయ్య, కె. శ్రీనివాస్, సి.నర్సింలు, మక్బుల్, శ్రీశైలం, హనుమంతు, ఆంజిబాబు, ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి..

**దౌల్తాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల గ్రామ 10వ వార్డు మెంబర్ రాములు నాయక్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచి, అనివార్య కారణాలతో బిఆర్ఎస్‌లో చేరిన ఆయన ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రావు ఆధ్వర్యంలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వెంకట్రావు ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆఫీసుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**కొడంగల్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు ఆఫీసుపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ ఆర్. వాణీశ్రీయావ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యావ్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంపు ఆఫీసుపై దాడిని వారు తీవ్రంగా ఖండించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హమీలు నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోలు ప్రతి ఆఫీసులో పెట్టాలనుకుంటే ప్రత్యేక .జీవో తీసుకుంటే తమకేమి అభ్యంతరం లేదన్నారు. పట్ట పగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగును తలపిస్తున్నదని దుయ్యబట్టారు. ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్టా లేనట్టా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులపై దాడులు ప్రజా సంఘాలపై దాడులు మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ క్యాంపు ఆఫీసులో దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలను తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వి.రవీంద్రచారీ, అవుసుల పరమేష్, బాపన్‌గేరి మోహన్ పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్‌కి భారతరత్న ప్రకటించాలి

**షాద్‌నగర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** జగ్జీవన్ రామ్‌కు భారతరన్న పురస్కారాన్ని తక్షణమే ప్రకటించాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంట నోళ్ళ నరసింహ డిమాండ్ చేశారు. షాద్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ముందు ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడతూ స్వతంత్ర సమరయోధుడు, సంఘ సంస్కర్తగా, భారత మాజీ ఉపప్రధానిగా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి యెనలేని సేవలు అందించారన్నారు. రాజ్యాంగ పరిషత్తు సభ్యునిగా రాజ్యాంగంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చట్టాలను రూపకల్పన చేసి హక్కులు అందించడంలో దేశంలో విప్లవాత్మకమైన మార్పులకు, సమానత్వం, సాంఘీక దురాచారాల నిర్మూలనకు శ్రమించారని అన్నారు. జగజీవనుడి ఆశయాలను కొనసాగిస్తామని వారి స్వప్నాన్ని సాకారం చేసి అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష ్యంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు నడుస్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో జోగు నాగ భూషణ్ మాదిగ ఎమ్మార్పీ ఎస్ ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షులు, కల్లేపల్లి బాలు మాదిగ, బొబ్బిలి పాండు మాదిగ, ఎర్రోళ్ళ సురేశ్ మాదిగ, నాగారకుంట మహేందర్ మాదిగ, సంగెం శ్రీను మాదిగ, దర్శన్. రమేష్. రాకేష్. నాగేష్. వేణుగోపాల్. శేఖర్. యాదయ్య. నర్సింలు. శివ కుమార్. రమేష్, పెంట నోళ్ళ రమేష్, పెంట నోళ్ళ భూషణ్,దేశాల సత్యానారాయణ, ఇటిక్యాల రాజు, కొందుర్గు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన బాబాఖాన్

# విధేయతకు పట్టం

### బాబా ఖాన్‌కు డీసీసీ కార్యవర్గంలో చోటు

**ధారూర్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** రాజకీయాల్లో పార్టీ పట్ల విధేయతతో ఉంటూ, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పటికైనా సముచిత గుర్తింపు లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మరోసారి నిరూపించారు. గతంలో తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన ధారూర్ మండలానికి చెందిన బాబా ఖాన్, ప్రసాద్ కుమార్ నాయకత్వంపై ఉన్న నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాటి నుండి పార్టీ పటిష్టత కోసం ఆయన చేసిన సేవలను స్పీకర్ ప్రత్యేకంగా గుర్తించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ విజయం కోసం, ముఖ్యంగా ప్రసాద్ కుమార్ గెలుపు కోసం బాబా ఖాన్ అహర్నిశలు శ్రమించారు. ఆయన కష్టానికి ప్రతిఫలంగా తాజాగా డీసీసీ కార్యవర్గంలో అవకాశం కల్పించి స్పీకర్ ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో బాబా ఖాన్ తన మద్దతుదారులతో కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

**నమ్మకాన్ని వమ్ము చేయం**

ఈ సందర్భంగా బాబా ఖాన్ మాట్లాడుతూ.. పదవులను త్యాగం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుండి పార్టీ బలోపేతం కోసం పనిచేశామని పేర్కొన్నారు. తమ కష్టాన్ని గుర్తించి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించిన స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. స్పీకర్ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

## అణగారిన వర్గాల పక్షాన పోరాడతాం

**తలకొండపల్లి, ఏప్రిల్ 5 ప్రభాతువార్త :** బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తలకొండపల్లి మండల నూతన అధ్యక్షునిగా అంతారం మాజీ సర్పంచ్ సొడమోని చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు రజినీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు లాలయ్య ముదిరాజ్ సమక్షంలో ఈ ఎన్నిక ప్రక్రియ సాగింది. ఉపాధ్యక్షులుగా తిరుమణి రాఘవేందర్ గౌడ్, భైరపాక భీమయ్య, సొడమోని వెంకటయ్య, ఆంజనేయులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా గుల్ల శేఖర్, శానమోని తిరుపతయ్య, కార్యదర్శులుగా సి.హెచ్. రాము జీ, రవిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చంద్రయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాధికారం దక్కే వరకు, రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరిగే వరకు జేఏసీ పోరాడుతుందని స్పష్టం చేశారు. అణగారిన కులాలపై ఎక్కడ అన్యాయం, అక్రమాలు జరిగినా జేఏసీ కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్, నాయకులు బాలస్వామి, షఫీ, రవి గౌడ్, రవి యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు వంకేశ్వరం రమేష్, మల్లేష్, వస్తువుల శేఖర్, జి. మహేష్ మరియు పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

**కొత్తూరు, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా కొత్తూరులో నిర్వహించిన మండల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి . కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్ వేదికగా మారింది అని అన్నారు, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. చిన్న వయసు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించవచ్చని యువతకు సూచించారు. టోర్నమెంట్‌లో విజేత జట్టుకు ఆంజనేయులు గౌడ్ స్వంత నిధులతో రూ.15,000 నగదు బహుమతి మరియు విన్నర్ కప్ అందజేశారు. రన్నర్ జట్టుకు కాంగ్రెస్ నాయకుడు ఎర్రవెల్లి నవీన్ చారి రూ.10,000 నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ బహుమతులను మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్ చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేయడం జరిగింది. ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని కాపాడుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణతో పాటు నిరంతర సాధన అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూరి శ్రీకాంత్, విక్రమ్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. టోర్నమెంట్ ముగింపుతో కొత్తూరులో క్రీడా వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ వేడుకలు

**తలకొండపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తలకొండపల్లి మండల బిజెపి అధ్యక్షుడు మరియు 9వ వార్డు సభ్యురాలు తిరుమణి అనుష రవి గౌడ్ తన నివాసంపై పార్టీ జెండాను ఎగురవేసి, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బిజెపి 46 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. గత 13 ఏళ్లుగా పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నిరంతర సేవా పథంలో సాగడం తనకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. "దేశం ముందు నేషన్ ఫస్ట్" అనే సిద్ధాంతానికి కట్టుబడి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను విశ్వగురువుగా నిలిపే మార్గంలో ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ఆవార్డును అందుకున్న కొడంగల్ లయన్స్‌క్లబ్ సభ్యులు

## కొడంగల్ లయన్స్‌క్లబ్‌కు పెక్సెలెంట్ ఆవార్డు

**కొడంగల్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త :** పేద ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా కొడంగల్ లయన్స్‌క్లబ్‌కు 2024-25 సంవత్సరానికి గాను ఫైవ్ స్టార్ ఎక్సెలెంట్ ఆవార్డులు లభించినట్లు లయన్స్‌క్లబ్ అద్యక్ష, కార్యదర్శులు మురారి వశిష్ట, వడ్డే భీమరాజు తెలిపారు. ఆదివారం శంషాబాద్‌లోని అతిథి కన్వెంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కోటేశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవార్డు అందుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ లయన్స్‌క్లబ్ అద్వర్యంలో ప్రస్తుత సంవత్సరం ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 300 మందికి కంటి అపరేషన్‌లు నిర్వహించినట్లు తెలిపారు.

అలాగే 8 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యనక్రమం, పర్యావరణాన్ని పరిరక్షించాలని యువతకు గుర్తు చేస్తు 51 మట్టి వినాయక విగ్రహాలను వితరణ చేసినట్లు తెలిపారు. అలాగే గర్బిణీలకు అవగాహన కార్యక్రమంతో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించడం జరిగిందన్నారు. కీళ్ళ నొప్పులకు ఉచిత వైదక్య శిబిరాల ఏర్పాటు, 11 రోజుల ఉచిత యోగా శిక్షణ శిబిరాల నిర్వహణ, గాంధీ జయంతి కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీకి నివాళులర్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆయా సేవా కార్యక్రమాలకు గాను డిస్ట్రిక్ గవర్నర్ లయన్స్ కోటేశ్వర్‌రావు నుండి ఫైవ్ స్టార్ ఎక్సెలెంట్ ఆవార్డు అందుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోషాధికారి వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ దాసప్ప యాదవ్, లయన్‌క్లబ్ సభ్యులు బాలక్రిష్టారెడ్డి, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్‌తో తప్పిన ప్రాణాపాయం

**నందిగామ, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడి తాండ గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాకు చెందిన ఓ మహిళ (42)శనివారం సాయంత్రం ఉన్నట్టుండి మానసిక ఆవేదనతో ఇంట్లో ఉరి వేసుకుంది. అందరూ చనిపోయిందని భావించారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి ఆమెను క్రిందికి దించి ఆమె ఛాతిపై సిపిఆర్ ప్రయోగం చేశారు. దీంతో ఆమె స్పృహలోకి రాగానే వెంటనే ఆమెను శంషాబాద్ లో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. వదిన ప్రాణాలు కాపాడిన మరిదిని, కుటుంబ సభ్యులు ఆ తాండ ప్రజలు అభినందించారు. సిపిఆర్ ప్రయోగంతో మృత్యువును జయించిన మోతి ఆరోగ్యంగా ఉన్నట్లు, ఈ అరుదైన సంఘటన ఈ ప్రాంతంలో సర్వత్ర చర్చ నియాంశమైంది.

## అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం

**కుల్కచర్ల, ఏప్రిల్, 5ప్రభాతవార్త :** అనుమత్తులు లేకుండా ఇసుక తరలిస్తే కటిన చర్యలు తిసుకుంటామని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు. అదివారం మండల పరిధిలోని కుసమసముద్రం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనియ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహింస్తుండగా కుసమసముద్రం గ్రామానికి చెందిన దస్తయ్య అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్బంగా ఎస్ఐ రమేష్ కుమార్ మాట్లాడుతూ...అక్రమ ఇసుక రవాణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.


అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



## లేమామిడిలో జోరుగా ఎల్ఏయూపి లీగ్

**కేశంపేట ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో జరుగు తు న్న లేమామిడి అంబేద్కర్ యూత్ ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ముమ్మరంగా సాగు తోంది. కేశంపేట మండలం అ ల్వాల, బాలానగర్ మండలం పెద్దరేవల్లి గ్రామాల మధ్య జరిగిన పోటీలో ఉత్తమప్రతిభను కనబరిచిన క్రీడా కారుడు శ్రీకాంత్కు ఆదివారం గ్రామ 5వ వార్డు సభ్యుడు డి.సురేందర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేసి మాట్లాడారు. పట్టుదల, అంకితభావంతోపాటు స్నేహపూరిత వాతా వర ణలో క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయ కుడు రమేష్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి మైసమ్మకు విశేష పూజలు

**కేశంపేట, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని టీఆర్ఎస్ నాయకులు ఆదివారం కడ్తాల్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్ రావు, కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి, లేమామిడి మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, బలరాజ్ గౌడ్ తదితరులు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజ లు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాంత ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడవాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మైసిగండి మైసమ్మ అమ్మవారు భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగా రమని, ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని పేర్కొన్నారు. ఆదివారం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. పూజల అనంతరం ఆలయ అర్చకులు నాయకులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.



## హిందూ సమ్మేళన ఉత్సవ సమితి నియామకం

**మోమిన్‌పేట, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపితమై 100 సం వత్సరాలు పూర్తి కావ స్తున్న సందర్బాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మోమి న్‌పే టలో ఈనెల 21న జరిగే హిందూ సమ్మేళనం కోసం ప్రత్యేక ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. సమితి అధ్యక్షులుగా వడ్ల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అమ్రాది రాంరెడ్డి, సుభాష్ గౌడ్, అంగేరి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కొస్గి శివకుమార్, జనార్ధన్ గౌడ్, విక్రమ్, కోశాధికారిగా కొట్ర శ్రీనివాస్ గుప్త నియమితులయ్యారని మండల నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



## తలకొండపల్లిలో చలివేంద్రం ప్రారంభం

**తలకొండపల్లి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ప్రారంభించారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికుల సౌక ర్యార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మల్లేష్, శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

**తలకొండపల్లి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బదనాపూర్ గ్రామంలో ఇటీవల వృతిచెందిన తోటపల్లి రాములమ్మ కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఆదివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ యాదవ్, వార్డు సభ్యులు లక్ష్మి ్మకాంత్ గౌడ్, నాయకులు విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లకు ఉచితంగా సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:** మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఇళ్లు నిర్మించుకుంటున్న పేదవారికి ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సిమెంట్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎర్పోలి యాదమ్మ, కొండ్రి సుజాత, లూరి యాదమ్మ, దరువుల మంజుల కుటుంబాలకు ఈ సాయం అందజేశారు. ఆర్థిక స్థోమత లేని వారిని ఆదుకోవడంలో ఉప్పల ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని సర్పంచ్ మాకం వీరేశలింగం ఈ సందర్భంగా కొనియాడారు. మరోవైపు చీపునుంతల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసుకునేందుకు వీలుగా పేదలకు సిమెంట్ పంపిణీ చేశారు. మాలే రవీందర్ రెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన కుట్ర పోచమ్మ, బత్తుల లక్ష్మి ్మదేవిల ఇళ్లకు అవసరమైన సిమెంటును వ్యక్తిగతంగా అందజేశారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల లక్ష ్మమ్మ, కాంగ్రెస్ నాయకులు గుజ్జుల మహేష్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన మారమోని నరసింహ అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై నరసింహ మృతి చెందడం బాధాకరమని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ కోటేశ్వర్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శామీర్‌పేట మండలంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళి

**శామీర్‌పేట, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు, యువకులు నివాళులు అర్పించారు. ఆదివారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి పలువురు నివాళులు అర్పించారు. బాబుజగ్జీవన్‌రామ్ చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊరడి వెంకటేశల ఆద్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. దీనిలో వారితో పాటు అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచు కంఠం కృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు ఎం.సుధాకర్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు ఎస్.అశోక్‌రెడ్డి, నర్సింగ్‌రావుగౌడ్, బాలేశ్, స్వామి, భాస్కర్‌గౌడ్, దినేశ్, పలువురు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జాము రవి, కౌన్సిలర్ నీరజ్‌గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, మాజీ ఎంపిటిసి పి.నాగరాజు, నాయకులు బి.జగన్నాథం, ఎం.లాలయ్య, నర్సింలు, పలువురు నాయకులు పాల్గొని బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పించారు. దేవరయాంజాల్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్, మాజీ సర్పంచు గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచు టి.శంకర్‌గౌడ్, నాయకులు పి.లక్ష్మినారాయణ, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, పలువురు నాయకులు, యువకులు, తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. శామీర్‌పేటలోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు యువకులు జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మేడి రవి, దప్పు మురళి, బోయిని రవి, పలువురు అంబేద్కర్, బాబుజగ్జీవన్ రామ్ యూత్ వారు తదితరులు పాల్గొన్నారు. కొల్తూర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటం ఏర్పాటు చేసి పూల మాల వేసి పలువురు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు ఎన్.కృష్ణ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దీనిలో మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ ఎం.శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బి.వెంకటేశ, పి.జైపాల్‌రెడ్డి, నర్సారెడ్డి, పలువురు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.


శామీర్‌పేటలో నివాళులు అర్పించిన నాయకుల దృశ్యం


దేవరయాంజాల్‌లో నివాళులు అర్పించిన జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి తదితరులు

# జగ్జీవన్ రామ్ ఆశయాలు స్ఫూర్తిగా ముందుకు సాగాలి


నివాళ్ళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రమాణం చేస్తున్న సుధాకర్‌గౌడ్, అరుణ్‌కుమార్


బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నాయకులు.


బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


చేవెళ్ల ,మడికట్టు గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు


కడ్మూరు గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు,తదితరులు


చేవెళ్లలోని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య


బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన వాళ్ళు అర్పిస్తున్న చైర్మన్ తదితరులు


ఘట్‌కేసర్‌లో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి. మాజీ కౌన్సిలర్ మల్లేశ్ తదితరులు

-కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి అర్బన్,ఏప్రిల్5,ప్రభాతవార్త:** డా.బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు స్ఫూర్తిగా ముందుకు సాగాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో ఆదివారం నిర్వహించిన డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ ప్రారంభ దశలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా సేవలందించి, అనంతరం రాజకీయాలలో ఎదుగుతూ కేంద్ర వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశానికి కీలక సేవలు అందించారని గుర్తుచేశారు.దాదాపు ఐదు దశాబ్దాలపాటు ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను స్మరించారు. అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దళిత వర్గాల అభివృద్ధికి, రిజర్వేషన్ల అమలుకు బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు.కార్మిక, వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహనీయుడని ఆయనను కొనియాడుతూ, ఆయన ఆశయాల సాధన కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**మోమిన్‌పేట్ మండలంలో**

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమరయోధుడు, నవభారత నిర్మాత, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 119వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుని జయంతిని పురస్కరించుకొని ఆదివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు, చిన్న కోల్కుంద గ్రామ మాజీ సర్పంచ్ కొనింటి సురేష్‌లు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు, సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కులరహిత సమాజం కోసం జీవితాంతం కృషి చేసి, బడుగు బలహీన వర్గాల ఆదర్శ నాయకుడిగా ఆయన నిలిచారని వారు తెలిపారు. బాబు జగ్జీవన్‌రామ్ 1908వ సంవత్సరంలో బీహార్ రాష్ట్రంలోని ఒక పేద కుటుంబంలో జన్మించి, అంచెలంచెలుగా ఎదిగి దేశ అన్యున్నత పదవులను అధిష్టించిన మహనీయుడని కొనియాడారు. చిన్నతనం నుంచే సమాజంలో ఉన్న కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా గళమెత్తిన ఆయన, విద్యనే ఆయుధంగా చేసుకొని అన్యాయాలపై పోరాడారని పేర్కొన్నారు. స్వతంత్ర భారత తొలి క్యాబినెట్‌లో అతిచిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బాబు జగ్జీవన్‌రామ్ గారు, కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను అమలు చేసినట్లు సురేష్ వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్ జీవితం ఒక తెరిచిన పాఠశాల వంటిదని, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శప్రాయమని వారన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సోదరభావం కలిగిన సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ సమగ్రతకు కృషి చేయడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొంటూ, మాతృదేశ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు ఉద్దాల జైపాల్, మోమిన్‌పేట్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ గౌడ్, దేవరంపల్లి సర్పంచ్ అశోక్, నాయకులు కే. సురేందర్, సామెల్, రాజు, రవి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ మండలంలో ...**

**షాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** ప్రముఖ సంఘసంస్కర్త స్వాతంత్ర సమరయోధులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను షాబాద్ మండ లంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు తమ్మలి రవీందర్ జడల రాజేందర్ రాపోలు నర్సింలు వెంకట్ యాదవ్ రమేష్ యాదవ్ రాహుల్ అశోక్ తదితరులు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొనియాడారు. అదేవిధంగా మండలంలోని నాగర్ గూడలో పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, నాగర్ గూడా సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్, తాళ్లపల్లి సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఈగ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పెంటయ్య ,నాయకులు అత్తిలి శ్రీనివాస్ రెడ్డి ,గడ్డ వెంకటరెడ్డి, కావలి శ్రీరాములు ,శేఖర్, రఫీక్, ఎండి జహంగీర్ ,సత్యం ,బాలు, నరసింహులు, పరమేశ్వర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల మండలంలో**

**చేవెళ్ల, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** చేవెళ్ల మండలంలోని మడికట్టు గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు, నివాళి సభలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవితం, సేవలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం గురించి ప్రసంగాలు నిర్వహించారు. ఆయన ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ న్యాలట గోవర్ధన్, వార్డు మెంబర్ కంకంటి మల్లేష్,మాజీ ఉప సర్పంచ్ రామస్వామి జయలత బాల్ రెడ్డి, న్యాలట అశోక్, న్యాలట నగేష్, విష్ణు వర్ధన్ రెడ్డి, డీ జగన్, యన్ గణేష్, డి, జశ్వంత్, డి బాలకృష్ణ, మైపాల్ రెడ్డి, నక్క సురేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, సభ్యులు, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బాబు జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషి చేయాలి**

**పూడూరు, ఏప్రిల్ 5, ప్రభాతవార్త ;** కులరహిత సమసమాజంకోసం కృషిచేసిన బాబు జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఎం సురేష్,బిఆర్ఎస్ మండల పార్టీ నాయకుడు అమీర్‌అలీ పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమర యోధుడు,సంఘ సంస్కర్త,మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతీ సందర్భంగా ఆదివారం పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు బస్‌స్టాండ్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడలేని కులవ్యవస్థ భారతదేశంలో ఉండేదని దాని నిర్మూలనకోసం బాబు జగ్జీవన్ రామ్,ఎంతోకృషిచేశారని గుర్తుచేశారు. గ్రామాల్లోని యువత సమసమాజ స్థాపనకోసం కృషిచేసిన బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కె రాములు, వెంకటయ్య, నసీర్, శ్రీహారిచారి, రాములు,యాదయ్య,కుమార్,సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

**బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవల చీరస్మరణీయం**

**-చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి**

**చేవెళ్ల, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవల చీరస్మరణీయమని, ఈయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకమని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదద్య అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అయన విగ్రహనికి పూల మాలలు వెసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదద్య మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం, రైతుల సంక్షేమం కోసం దేశ ఆర్దికాభివృద్ది కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన మహగోప్ప నాయకుడన్నారు. స్వాతంత్ర్య సమరయోదుడు, సంఘ సంస్కర్త రాజకీయ వెత్తగా ఆయన దేశానికి చేసిన సేవల మరువలేవన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చివరి శ్వాస వరకు పనిచేసిన గోప్ప నాయకుడన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్‌లు బందారి శైలజ ఆగిరెడ్డి,మండళి కళ్యాణి యాదగిరి, మద్దేల శ్రీనివాస్,క్రిష్ణానాయక్,అత్తెల్లి మనిషా, బిజెపి నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి,అత్తెల్లి అనంద రెడ్డి,శంకర్‌గౌడ్,ఆగిరెడ్డి,దేవర వెంకట్‌రెడ్డి,గంగి యాదయ్య, జంగారెడ్డి, మంగళి యాదగిరి, సంఘం నాయకులు కోజ్జంకి యాదయ్య, కోజ్జంకి సుదర్శన్, కందాడ మాణిక్యం, పోట్ట నర్సింలు, అశోక్, కందావాడ బాల్‌రాజ్, సిద్ది రాజు, ఆశోక్, సిద్ది నవీన్,గంగి అభి,ఎస్‌ఎఫ్ఐ నాయకులు అరుణ్ కుమార్ పాల్గోన్నారు.

**కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో**

**కొడంగల్,ఏప్రిల్ 5,ప్రభాతవార్త:** బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షులు జూనియర్ కృష్ణంరాజు,యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు అన్నారు.బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ బాబు జగ్జీవన్ రామ్ అందరికి ఆదర్శ ప్రాయుడని,నాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంలో అనేక మంత్రిత్వ శాఖలకు మంత్రిగా వ్యవహరించి ప్రధానంగా వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి నూతన వ్యవసాయ పద్ధతులు కొనసాగేలా చట్టాలు రూపొందించారని,అలాగే అంటరానితనం పూర్తిగా నిర్మూలన చేయడానికి చిన్న వయస్సు నుండే కృషి చేసి ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేశారని,ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడువాలని వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో జి.అశోక్,ఆనందం,చిన్నయ్య,వెంకటయ్య,రవి,లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**శంకర్‌పల్లిలో**

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో స్వాతంత్ర సమర యోధులు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బాబు జగ్జీవన్ రామ్ సమాజంలో అణగారిన వర్గాల అభివృద్ధి కోసం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యత, మరియు సోదరభావం పెంపొందించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ మేనేజర్ వి అంజన్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

**తలకొండపల్లిలో**

**తలకొండపల్లి ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం నాడు భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ 119 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవనం ఆవరణంలో ఎమ్మార్పీఎస్, కుల సంఘాలు, మాజీ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో అతని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఆమోదం కోసం బాబు జగ్జీవన్ రావు ఎంతో కృషి చేశాడని, నిరుపేద స్థాయి నుంచి దాని వరకు ఎదిగాడని, ఎంతోమందికి భారతరత్న ఇచ్చిన ప్రభుత్వం జగ్జీవన్ రావును మరిచారని ఇప్పటికైనా అతనికి భారతరత్న ఎంతోమందికి భారతరత్న ఇచ్చిన ప్రభుత్వం జగ్జీవన్ రావును మరిచారని ఇప్పటికైనా అతనికి భారతరత్న బిరుదు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, జిల్లా దళిత నాయకులు డేవిడ్, నాయకులు పోతుగంటి, శ్రీకాంత్, యాదయ్య, నరేందర్ గౌడ్, నారాయణ రమేష మల్లేష్ పాండు యాదవ్ మల్లేశ్వరి జంగయ్య శ్రీశైలం జయ కుమార్ మల్లేష్ నాగరాజు రాములు, సుధాకర్, తదితరులున్నారు.

**బడుగు, బలహీనవర్గాల జనోద్దరణకు జగ్జీవన్‌రాం కృషి**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** దళిత జనోద్దరణకు స్వర్గీయ బాబు జగ్జీవన్‌రాం అందించిన సేవలు చిరస్మరణీయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడ-సర్దార్‌పాపన్న చౌరస్తాలోని డానో కంపెనీ వద్ద ఆదివారం జరిగిన మాజీ ఉపప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతిలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుధీర్‌రెడ్డిలతో పాటు డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాళలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాబుజగ్జీవన్‌రాం ఆశయ సాధనలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎస్‌సీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎదులాబాద్ డివిజన్ లింగాపూర్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు.

**స్వేచ్ఛ, సమానత్వంతోనే దేశాభివృద్ధి**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారానే బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు వచ్చి పదవులు సిద్దించాయని బీబీనగర్ మాజీ ఎంపిపి ఎరుకల సుధాకర్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 260వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపిపి సుధాకర్‌గౌడ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్ అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం మాజీ ఉపప్రధానమంత్రి బాబుజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. అరుణ్‌కుమార్ ఈసందర్భంగా జగ్జీవన్‌రాం జీవితచరిత్రను వివరించారు.

## కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

**చౌడపూర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కట్ట మైసమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆదివారం చౌడపూర్ ఊట కుంట దగ్గర వెలసిన కట్టమైసమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. దాతల సహాయంతో త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి , విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను చేపడతామని గ్రామ పెద్దలు తెలిపారు.గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్ , ఉప సర్పంచ్ రాజు , శ్రీనివాస్ రెడ్డి , శ్రవణ్,ఉమాపతిరెడ్డి, పాలనర్సింలు,శ్రీనివాస్,వెంకటేష్, కృష్ణయ్య , యువకులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం దోహదం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని ఘట్‌కేసర్ మాజజీ జడ్పీటీసీ సభ్యులు సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ పావన్న చౌరస్తాలో లాల్‌బహదూర్ స్మారక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. యూత్ ప్రధాన కార్యదర్శి బచ్చు నగేశ్‌కుమార్ ఆధ్వర్యంలో బాటసారులకు చల్లటి మజ్జిగను అందజేసి దాహార్తి తీర్చారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాంరెడ్డి పేర్కొన్నారు.




ఈకార్యక్రమంలో లాల్‌బహదూర్‌స్మారక యువజన సంఘం అధ్యక్షులు సి.బ్రహ్మం, గౌరవ పోషకులు సింగిరెడ్డి రాంరెడ్డి, గౌరవ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, సలహాదారులు మారం లక్ష్మారెడ్డి, సభ్యులు కృష్ణారెడ్డి, కోవ యాదగిరి, రాంమోహన్, బోగ అర్జున్, రేసు లక్ష్మారెడ్డి, నోముల నవీన్‌ప్రకాష్, కుమార్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**శామీర్‌పేట, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** శామీర్‌పేటలో రాజీవ్‌రహదారిన జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి (65) మృతిచెందారు. ఆదివారం సాయంత్రం శామీర్‌పేటలో రోడ్డు ప్రమాదం జరిగింది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం శామీర్‌పేటలో ఎంఆర్ చాయ్ టీ పాయింట్ సమీపంలో రోడ్డును దాటుతున్న సమయంలో ఆర్టీసి బస్సు అతన్ని ఢీకొనటంతో తలకు తీవ్రగాయాలు అయి అక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట నుంచి అలియాబాద్ వైపునకు వెళ్తున్న ఆర్టీసి బస్సు నెంబరు (టిఎస్07యుబి6177గలది)ఆ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న సమయంలో ఆ బస్సు ఢీకొనటంతో ఆయన మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి తలకు తీవ్రగాయాలు కావటం, కాళ్లపై క్రష్ కావటంతో ఆ సంఘటన స్థలంలోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలియలేదని, గుర్తింపు కోసం చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే శామీర్‌పేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గ్రానైట్ రాయిని అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## హనుమాన్ దేవాలయానికి విరాళం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 5,(ప్రభాతవార్త):** జిల్లెడ్ చౌదరిగూడెం మండలం వీరన్నపేట గ్రామంలోని నూతనంగా నిర్మాస్తున్న ఆంజనేయస్వామి దేవాలయానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయయాదవ్ విరాళం అందజేశారు. గ్రామస్తుల విన్నపం మేరకు దేవాలయ నిర్మాణానికి దాదాపు నాలుగు లక్షల విలువ గల గ్రానేటు రాయిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం గ్రానైట్ రాయిని బిఆర్ఎస్ పార్టీ నాయకులు వీరన్నపేట గ్రామానికి చేరవేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యాద్ హఫీజ్, గ్రామ సర్పంచ్ సుమలత వెంకట్రాములు, జహంగీర్, సలీం,జిల్లెళ్ల వెంకటేష్, రాములు, సత్యం గౌడ్, అమీర్, ఆనంద్ గౌడ్, సోహెల్, మోతిలాల్ నాయక్, నర్సిములు, మంత్రి నర్సిములు,పరిగి శివ, గవిండ్ల శేఖర్, తాండ్ర లక్ష్మయ్య, శివ, రమేష్, చంద్రబాబు,గణపురం నరసింహులు జగదీష్ , గౌస్, మాన్నయ్య, బోలరాజు, బాలరాజ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటే సిరులున్నట్లే

**పిట్టి ఇంజనీరింగ్ పరిశ్రమ సిఎండి శరత్ పిట్టి**


పిట్టి పరిశ్రమలో జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సీఎం డి.

**నందిగామ, ఏప్రిల్ 5, ప్రభాతవార్త:** ఆరోగ్యమే మహాభాగ్యమని , ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని సాధించుకోగలమని పిట్టి ఇంజనీరింగ్ సిఎండి శరత్ పిట్టి అన్నారు. నందిగామ మండలం అంతిరెడ్డిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని పిట్టి ఇంజనీరింగ్ పరిశ్రమలో ఆదివారం బద్రీవిశాల్ పన్నాలల్ పిట్టి ట్రస్ట్ మరియు అగర్వాల్ సేవ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పిట్టి ఇంజనీరింగ్ పరిశ్రమ సీఎండీ శరత్ బి పిట్టి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్మికులు కుటుంబ సభ్యులతో సమానమని, కార్మికులు బాగుంటేనే దేశాభివృద్ధి జరుగుతుందని, గత కొన్ని సంవత్సరాలనుండి పిట్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం తీసిపోని రీతిలో వైద్యం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పిట్టి ఇంజనీరింగ్ ప్లాంట్ జీఎమ్ వెంకటరమణ, నాగిరెడ్డి, హెచ్ఆర్ జీఎమ్ శ్రీనివాస్, అర్కాదిప్, ఏజీఎమ్ శ్రీనివాస్ రావు, హెచ్ఆర్ రంజిత్, మధు, మహేష్, ప్రభాకర్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ నాయకులు

## ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలి..

**రంగారెడ్డిఅర్బన్,ఏప్రిల్5,ప్రభాతవార్త:** ముదిరాజ్ రిజర్వేషన్లను పెంచి రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలని కోరుతూ తెలంగాణ ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగాల సంఘం జిల్లా అధ్యక్షులు ఎడ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తుక్కుగూడలోని ముదిరాజ్ భవన్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.రాష్ట్రం,జిల్లా నలుమూలల నుండి వివిధ శాఖలకు చెందిన ముదిరాజ్ ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరై పలు కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా పాల్గొన్న ముదిరాజ్ వర్గానికి ప్రస్తుతం ఉన్న బిసి డి వర్గీకరణను బిసి ఎగా మార్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.అలాగే రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయించి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో భాగంగా ముదిరాజ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముదిరాజ్ ఉద్యోగులు ఐక్యంగా పనిచేసి అన్ని రాజకీయ పార్టీల వద్ద తమ హక్కులను సాధించుకునే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాయిళ్ళ ధనరాజ్ ముదిరాజ్, రాష్ట్ర కోశాధికారి రాజమోని మహేశ్వర్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాములు ముదిరాజ్, జిల్లా కోశాధికారి సప్పిడి మహేష్ ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సన్నిల బాలకృష్ణ ముదిరాజ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కాల్వ విష్ణువర్ధన్ ముదిరాజ్, టీజిటీపే అధ్యక్షుడు డా. కొర్వి బాలకృష్ణ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రాజమోణి రాజు ముదిరాజ్, తుక్కుగూడ మత్స్య సహకార సంఘం చైర్మన్ కుక్కల కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతో హక్కులు సాధించుకుందాం..

**షాబాద్, ఏప్రిల్ 5, ప్రభాతవార్త :** కురుమలు ఐక్యమత్యంగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలని రంగారెడ్డి జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షులు రాపోలు నర్సింలు అన్నారు. కురుమ సంఘం మండల అధ్యక్షులు మద్దూరు పాండు కురుమ ఆధ్వర్యంలో మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామ అధ్యక్షునిగా రంగం ఆంజనేయులు కురుమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పెదేటి సంజీవ కురుమ, రాపోలు రాజేందర్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీద సత్యనారాయణ కురుమ, సలహాదారులుగా ఒగ్గు భీమయ్య కురుమ, కార్యదర్శిగా బుధారపు కుమార్ కోశాధికారిగా మీసాల రాజేందర్ కురుమ, కార్యదర్శిగా చట్టా రాఘవేందర్ కురుమను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు మల్లారెడ్డి కూడా ఉపసర్పంచ్ మాణిక్యం కురుమ మాజీ ఉపసర్పంచ్ రంగం శ్రీనివాసు మీసాల వెంకటయ్య వార్డు మెంబర్లు తెదేటి జంగయ్య మీసాల మహేందర్ జ్యోతి శ్రీకాంత్ అనూష గోపాల్ కవిత మల్లేష్ యాదయ్య రాపోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

